

# అమెరికా అమ్మాయి

## – శ్రీనిధి యెల్లల



**ఉద్యోగాలకోసం కొందరు**, చదువుల కోసం కొందరు, ఇలా వారి వారి కలల వెంటపడి చేరుకునే గమ్యం ఒకటి ఉంది ....అదే అమెరికా!

చిన్నతనంలో ఎంతో  అబ్బురంగా, స్వర్గానికి మరోపేరుగా తలచిన దేశం. అక్కడి విశేషాలు, వస్తువులు, అక్కడినుంచి వచ్చిన మనుషులూ, అందరూ ఎంతో గొప్పవారనీ  దేశంలో ఎంతటి పేరున్న గుడి వారైనా పూర్ణ కుంభంతో స్వాగతం పలికేటంత వి.వి .ఐ పీలు అనీ అనుకునే రోజుల నుండీ ... “ఆ వదినా మా పిల్లకి ఆవకాయ్ పట్టడానికి సాయానికి అమెరికా వెళ్తున్నాను దార్లో మీ అబ్బాయికి  ఏమైనా ఇవ్వాలంటే ఇవ్వు, ఇచ్చేసి వస్తాను” అనే రోజుల్లోకి వచ్చేసాము .

దూరం కొద్దీ విలువని అంచనా వేసే మనం, ఆ దూరం తగ్గిపోయేసరికీ విలువనీ తగ్గించేస్తున్నామేమో?

ప్రపంచంలో అందరూ రెండే రెండు రకాల వారి గురించి చర్చిస్తూ ఉంటారు. ఒకళ్ళు ఉత్తములు అయితే  మరొకళ్ళు అధములు. వీళ్ళు కాకుండా మరొక రకం ఉంది అదే  మధ్యముల్ అన్నమాట. పై చెప్పిన రెండు రకాల వారి గురించి చర్చిస్తూ ఉంటారు . వీళ్ళ గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోరు. కానీ వారు మాత్రం అందరి సమస్యలు నెత్తిన వేస్కుని భూభారాన్ని మోసేస్తూ  ఉంటారు. ఆ కేటగిరీలో ఫస్టు ఉండేవాళ్ళలో నేనొకదాన్ని. ఉద్యోగం వదిలేసి భర్త వెంట అమెరికా వాసం వచ్చిన కాండిడేట్ ని. వీసా సమస్యల వల్ల ఇంట్లో చిక్కుకుపోయి , రోజూ న్యూస్ లో వచ్చే అమెరికా వార్తలు విని నాకెప్పుడూ ఉద్యోగం వస్తుందో అని లెక్కలు వేసే చుట్టాలని మేనేజ్ చేస్తూ, ఒంటి చేత్తో ఇంటినీ, పిల్లల్ని మేనేజ్ చేస్తూ, ఉద్యోగాలకి వెళ్లే ఆడవారి వైపు ఆరాధనగా, హడావిడిగా కాలేజులకీ పార్టీలకి వెళ్లే పిల్లల వైపు ఈర్ష్యగా, ఇప్పుడే కొత్తగా వచ్చిన వారిని తేలిగ్గా చూస్తూ, గడుసుగా ఈ అమెరికా వాసాన్ని ఈదుతూన్న ఒక సగటు తెలుగు పిల్లని.

మబ్బుల చాటు తొలగిపోతున్న కొద్దీ, కాస్తకాస్తగా బయటపడుతున్న అందమైన దేశాన్ని విమానపు కిటికీలోంచి ఆనందాతిశయంతో చూసిన మొదటి క్షణాలు ఎన్నటికీ మరచిపోలేను. చదివిన చదువూ, చేసిన ఉద్యోగం దేనివల్లనైతేనేం సిగ్గు, బిడియాలు అనే ఆభరణాలు పాతవైపోయి పర్యుత్సుకత, ఉత్సాహం అనే అలంకారాలు మాత్రమే ధరించిన ఈకాలపు అమ్మాయిని. ఎయిర్ పోర్ట్ నుండి బయట పడి అమెరికా గడ్డపై నిలబడ్డప్పుడు మొట్ట మొదటగా గమనించిన మార్పు, మనుషుల కరువు. ఒక్క నిమిషం ఉక్కిరిబిక్కిరి చేసిన ఒంటరితనం. చిన్న కలవరపాటు. రివ్వున వీస్తున్న చల్లటి గాలికి కళ్ళలో ఊరిన తడికి అస్పష్టంగా అల్లుకుని పోయినట్టు ఉన్న బంగారు అక్షరాలు . తేరుకుని చూద్దును కదా, అరచేతిలో  ఉన్న పాస్ పోర్టుపై  "సత్యమేవ జయతే" అన్న అక్షరాలు. నువ్వు నా బిడ్డవి,  నీకు ఎదురే లేదు అని ఎదో శక్తి భుజంతట్టిన భావన. అలా పడింది అమెరికా నేలపైన నా మొదటి అడుగు. ఇక్కడి ప్రస్తుత జీవనం, ఇన్ని సుఖాల మధ్య ఉండే కష్టాలు, ఉక్కిరిబిక్కిరి చేసేంత పని లేదా పిచెక్కించేంత ఏకాంతం, చదువుకునేందుకు పాట్లు, ఉద్యోగపు వేటలు, తల్లితండ్రుల ఆశలు పిల్లల ఆశయాలు ఇలా ఎన్నో విశేషాలు. ఈ భావోద్వేగపు రంగులరాట్నంలో నాతో పాటు షికారుకు తయారు అవ్వండి మరి..

★★★

# మంచి తరుణం మించిన దొరకదు

మా ప్రాంతంలో ఒకటే వర్షాలు. ఇక్కడ ఒక మోస్తరు తుంపర చూసాను గానీ, ఇంతలా వర్షాలు పడటం ఈ మధ్య కాలంలో ఇదే. దాదాపు ఆరేళ్ళ పాటూ ఉందిట కరువు. “ఎటు చూసినా ఇంత చక్కగా బొమ్మ గీసినట్టుగా ఉంటుంది కదా, ఇక్కడేం కరువు!” అనుకునేదాన్ని. నేలపై జారిన ప్రతి చినుకుని ఒడిసిపట్టుకుని, రిజర్వాయర్లు నింపుకుని కాలం గడిపేశారు. ఇప్పుడు ఈ వర్షాలతో కాస్త ఊపిరి పీల్చుకుంది మళ్ళీ కాలిఫోర్నియా. చూసారా, ఎప్పటికైనా మంచి రోజులు వస్తాయి . ఈ నమ్మకమే మనిషిని నడిపించేది. మనలో  ఆశని నింపి వచ్చే మంచి కాలం కోసం ఎదురుచూసేలా చేసే ఏ చిన్న సంఘటనని కూడా ‘మేము’ వదులుకోలేము.  పైగా వచ్చేది మహిళా దినోత్సవం కూడాను. మా సంఘం వాళ్ళు నా స్పీచ్ కూడా ఏర్పాటు

చేసారు. సంఘం అనగానే ఏదేదో ఊహించేసుకోకండి, ఇండస్ట్రీ లో బిరుదులు ఎవరూ ఇవ్వరు మనమే ఇచ్చేసుకోవాలి . అదే కోవలో ఇక్కడ ఎవరి పరిస్థితులకి తగట్టు వాళ్లే ఒక గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలి. ఎవరి టాలెంటును వారే ప్రదర్శించుకోవాలి. సెల్ఫ్ మార్కెటింగ్ చాలా ముఖ్యం ఈ రోజుల్లో.

ఈ ఉపోద్ఘాతం ఎందుకో చివరాఖరున చెప్తాను.

ముందుగా మీకో కథ చెప్పాలి. అనగనగా ఒక మధ్యతరగతి మగమహారాజు. తాను అనుకున్న రూల్స్ ప్రకారం జీవితాన్ని సెట్ చేసుకుని, 'నేను ఎవరి జోలికీ వెళ్ళను... కాబట్టి నా జోలికి ఎవరూ రాకండి' అంటూ మడిగా ఉండిపోయాడు. పిల్లలకి ఒక అందమైన ప్రపంచం ఏర్పాటు చేసాడు. పొంగి పొరలి, ఆగడం అయ్యేంత సౌకర్యాలు లేకపోయినా, దేనికీ తడుముకోవలసిన అవసరం లేని జీవితం అది. ఆ రాజుగారికి ఒక చిట్టి చిలకమ్మ లాంటి రాకుమారి. ఇంతలేసి కళ్ళతో నాన్నని మాత్రమే చూస్తూ పెరిగిన రాకుమారి, 'మై డాడీ ఈస్ ది బెస్ట్', 'ఐ ఆమ్ డాడీస్ ప్రిన్సెస్' లాంటి బిరుదులు తనకి తానే ఆపాదించుకుని నాన్న రాసుకున్న లెక్కల ప్రకారమే పెరిగింది. 'మనకి చదువే ఆస్తి తల్లి, బాగా చదూకుంటేనే భవిష్యత్తు,' అని నాన్న చెప్తే, అర మార్కు తగ్గినా విల విల్లాడిపోయి తిండి నిద్రా మరచి మరీ చదివింది. 'పదో తరగతి బాగా చదువుకో, ఈ ఒక్క సంవత్సరం కష్టపడ్డావంటే లైఫ్ సెటిల్ అయిపోతుంది,' అంటే సరే అని పండగలూ, పబ్బాలు మానేసి మరీ చదివేసింది. నాన్న గర్వంలో పడ్డ కష్టం అంతా మర్చిపోయింది.

అక్కడికి లైఫ్ లో సెటిల్ అయిపోవచ్చు అనుకుంటే, ఇంటర్ వెక్కిరించింది. ఎంసెట్ పళ్ళికిలించింది. చిన్న టౌన్లనుండి బయటి ప్రపంచంలోకి అడుగు వేసింది. అలా భవిష్యత్తు బాటకి ఓం ప్రథమంగా, అందరితో పాటూ తానుగా నాన్న చెయ్యి విడచి చదువులకి, ఎంసెట్ రుద్దుళ్ళకీ మక్కాగా వెలసిన విజయవాడలో కాలు పెట్టింది. హాస్టల్ లో విడచి వెళ్ళేటప్పుడు నాన్న చెప్పిన మాటలు , 'మన ఆస్తి చదువే తల్లీ , ఈ రెండేళ్లు చదివేస్తే జీవితం అంతా సుఖంగా ఉండొచ్చు' అన్నవే ఊపిరిగా చదివింది. చదువంటే అదొక పూనకం లాంటి అవస్థ. రెండేళ్లు స్టడీ హౌర్ లో చైర్ కే పరిమితం అయిపోయి మరీ చదివింది. హాస్టల్ లో గంట తప్పించి వారాలూ, నెలలూ తెలీకుండా చదివింది. ఎగ్జాంస్ లో ఎక్స్ట్రా ఆన్సర్ షీట్స్ పై తప్ప వేరే ఏ విధమైన ఎక్స్ట్రా కరిక్యూలర్ ఆక్టివిటీస్ మీద కూడా కనీసం ఆలోచన పోకుండా దీక్ష పట్టింది. సిరిమల్లె తోటల్లో పరిగెట్టే పదహారేళ్ళ శ్రీదేవి ఈ చదువుల చిలకమ్మని చూసి సిగ్గుతో చచ్చిపోయింది.

ఎంసెట్ ర్యాంకుకి , స్కూల్ ఫైనల్ మార్కులకి తేడా తెలుసుకుంది. లక్షల్లో వున్న తన బోటి వాళ్లలో మరీ మొదటి ర్యాంకులు తెచ్చుకునే అఖండ తెలివితేటలు కాదూ, ఏదో ఒకటిలే అనుకునే బ్యాక్ బెంచు బాపతూ కాక గిల గిలా కొట్టుకుంది. కౌన్సిలింగ్ వడపోతలు, రిజెర్వేషన్ పంపకాలు అయ్యాక తనకు మిగిలిన కాలేజీ లో జాయిన్ అయింది. పెద్ద నగరంలో , పెద్ద కాలేజీలో చేర్పించడానికి వచ్చిన నాన్నకి ఇప్పుడు తానే ధైర్యం చెప్పింది. చదువుకుంది, ఎంతో నేర్చుకుంది, పరిస్థితులను నేర్పుగా చక్కదిద్దుకునే నైపుణ్యం సాధించింది. చదువు తర్వాత కొలువు స్థిరమైంది. నాన్న చెప్పిన 'చదువే మన ఆస్తి' అన్న కథ కంచికి చేరిందని తలచింది. మురిసింది. ఊరు దాటని అమ్మని నాన్నని నగరం అంతా తిప్పి సంబరపడింది. తన చేతిలో ఇమిడిపోయే చిట్టి చెయ్యి , తన చెయ్యే పట్టుకుని ఇంకో కొత్త ప్రపంచం చూపిస్తుంటే నాన్న పొంగిపోయాడు. ఇద్దరి సంతోషం చూసి అమ్మ కూడా. నాన్న చెప్పే 'చదువే ఆస్తి' అనే కథకు చక్కని ముగింపు ఇచ్చాననుకుంది. ఆర్ధిక స్వాతంత్రం ఇచ్చిన స్వేచ్ఛతో ఎగిరింది. తోటి చిలకమ్మలతో ఆనందంగా కాలం గడిపింది.

కథ ఇంతటితో అయిపోయింది అనుకుంటున్నారా ! నో! ఇది అంతం కాదు ఇంకో కొత్త అధ్యాయానికి ఆరంభం మాత్రమే. ఆ ఆరంభానికి నాంది పెళ్లిచూపులు. అమ్మా నాన్నల ప్రేమలో తను అనుకున్న అంచనాలకు తగ్గ వాడు దొరకక, పెద్దలు చూపించిన జాతిముత్యాలు లాంటి పెళ్లి కొడుకులు నచ్చక , ఎవరో ఒకరు అని సర్దుకోలేక కొట్టుమిట్టాడింది. ఇప్పటి వరకూ సీన్ లోకి రాని చుట్టాలు రెక్కలు కట్టుకు వచ్చారు. లేనిపోని వంకలు చూపెట్టారు. ఇప్పుడు ఇన్నాళ్లు లేని ఒక కొత్త ప్రశ్న మొదలైంది, " ఏం వెనకేసారూ ?"అని. నాన్న చెప్పినట్టు 'చదువే కదా ఆస్తి,' అనుకుని అదే చెప్పింది. విరగబడి నవ్వారు అంతా. ఏదైతేనేం కిందా మీదా పడి తనకు తగ్గవాడిని , అమ్మకి నాన్నకి నచ్చినవాడిని, తనని మెచ్చినవాడిని చూసుకుని పెళ్లి చేసేసుకుంది. ఇక్కడితో ఒక అధ్యాయం సమాప్తం. ఇప్పుడే మరి కథలో ఒక ట్విస్టు. ఆ విధంగా పెళ్లి చేసుకుని అన్ని పనులూ సమానంగా పంచుకుని సహ జీవనం సాగిస్తూ విదేశీ హంగులకి ఏమాత్రం తగ్గని మెట్రో జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్న జంటకి అమెరికా వీసా దొరకడం, అమెరికా అంటే ముందంజ వేయడమే గానీ అస్సలు ఏమాత్రం ఆలోచించే ప్రసక్తే లేని సగటు భారతీయుడిలా సంసారం అమెరికాకి షిఫ్ట్ చేసెయ్యడం చక చకా జరిగిపోయాయి.

అలా ఆ విధంబున మన చిట్టి రాకుమారి డిపెండెంటు వీసాపై కట్టుకున్న వాడి చిటికెన వేలు పట్టుకుని సప్త సముద్రాలూ దాటి అమెరికా గూటికి చేరింది. ఆంక్షలు లేని సంసారం, అంతులేని ఏకాంతం , భూతల స్వర్గంలో కాపురం. మొదటి కొన్నాళ్ళు భలే మంచి రోజులు లాగా, యద్దనపూడి నవలల్లో ఆఫీసరు గారి భార్యల్లా ఇల్లు చక్కపెట్టుకోవడం, మొగుడ్ని ఆఫీసుకి పంపడం, తను తిరిగి వచ్చేదాకా ఎదురు చూస్తూ ఉండడం లాంటి సుకుమారమైన పనులే కాబట్టి ఎంతో హాయిగా వేగంగా కొన్ని నెలలు గడిచాయి. చదువులు మొదలైనప్పటినుండి లేని తీరిక, పరుగులుపెట్టి ఆఫీసులో టార్గెట్లు చేరే హడావిడిలో దొరకని ప్రశాంతతని చూసి మురిసిపోయింది. 'హోమ్ – స్వీట్ హోమ్' ఒకటి ఏర్పరచుకుంది. "ఓహోహో ..పావురమా ..ఓహోహో " అంటూ సాగిపోతోంది జీవితం . ఇక్కడితో కూడా 'ది ఎండ్' రాలేదు రాకుమారికి. కట్ చేస్తే మళ్ళీ చుట్టాలు, వారి మాటలకు తాళం వేస్తూ అమ్మా నాన్న సీన్ లోకి ఎంటర్ అయ్యారు. పైగా పెళ్లితో అవతలి వైపు నుండి మరొక చుట్టాల బ్యాచి కూడా సిద్ధం కదూ . "ఏదన్నా వెనకేసుకోవాలి అంటే ఇదే సమయం" అని చుట్టాలు అంటే, "ఇంత చదువూ చదివింది ఇందుకేనా అమ్మలూ!!" అని సెంటిమెంటు వీణ మోగించే పెద్దాళ్ళు .

మరొక అధ్యాయం మొదలు ... ఇదే సమయానికి ఈ కొత్త మోజు మబ్బులు వీడినై రాకుమారికి. ఎంతసేపూ ఎదురుచూపులే మిగిలినాయి, దిక్కుతోచనివ్వని నిశ్శబ్దం వెక్కిరించింది. ఊహతెలిసిన నాటి నుండి ఊపిరాడకుండా చదివిన చదువులు, చేసిన కొలువులు . అలా కాలు కదపకుండా ఇంట్లో ఎన్నేసి రోజులు ఉండాలో తెలిక, అసహనం ఒళ్ళు విరుచుకుని నిద్ర లేచింది.

తరచి చూస్తే తనలాగా ఎందరో. తన లాంటి చిట్టి చిలకమ్మలు కోకొల్లలు అని తెలుసుకుంది. డాలర్ ని వందల స్థానం నుండి ఒకట్ల స్థానంలోకి తెచ్చి చూడలేక, అద్దాల వెనుక ఉన్న మనసుకి నచ్చిన వస్తువులు విండో షాపింగ్ చేస్తూ, అడిగి సాధించుకోడానికి అహం అడ్డొస్తూ అన్నిటిని 'తమకి ఉద్యోగం వచ్చాక చెయ్యాల్సిన పనుల లిస్టు'లో చేరుస్తూ, ఆ జాబితా రోజు రోజుకి హనుమంతుని తోకలా పెరుగుతోంటే నిట్టూరుస్తూ కాలాన్ని ఖర్చు చేస్తూ ఉన్నారు.

ఉన్న ఖాళీ సమయం ఏం చెయ్యాలో తెలియక చెయ్యని పనులు లేవు, నేర్వని విద్యలు లేవు. ఇన్నేళ్లు పట్టించుకోని ఎక్స్ట్రా కరికులర్ ఆక్టివిటీస్ మీద డబల్ ఎక్స్ట్రా ఫోకస్ పెట్టడం మొదలు. అత్యవసర పరిస్థితులలో అక్కరకు వచ్చే వంటలు మాత్రమే నేర్చుకుని వచ్చిన వీళ్ళు ఇప్పుడు చెయ్యని వంట లేదు . దేశ విదేశీ వంటలు చేసే వాళ్ళు కొందరైతే, అవి బ్లాగుల్లో, వ్లోగ్ లలో ఎక్కించేవారు కొందరు. జుమ్బా నుండి బాలీవుడ్ దాక ఉన్న డాన్సులు నేర్చేవాళ్ళని చూస్తారా, ఫేస్బుక్ రచయిత్రులుగా మారిన వారిని చూస్తారా, స్విమ్మింగ్ నుండి కరాటే వరకూ, లైబ్రరీ వాలంటీరింగ్ నుండి చిన్నపిల్లల స్టోరీ టెల్లింగ్ వరకు , గుళ్ళలో సేవ నుండి ప్రసాదాలు చెయ్యడం వరకూ, బేకింగ్ క్లాసులు, ఫొటోగ్రఫీలు , కుట్లు – అల్లికలూ, బూట్ క్యాంపులు, స్విమ్మింగ్ క్లాసులు, పెయింటింగ్ క్లాసులు , వీటన్నిటి మధ్యలో తిన్నా తినకపోయినా డబల్ బన్ లా ఉబ్బే ఒళ్ళు , దాన్ని అదుపులో పెట్టడానికి జిమ్ములు.. వెరసి ఎక్కడ ఏ ఆప్షన్ కూడా మిస్ అవ్వకుండా ఏ ఏ విధంబుల సమయం ఖర్చు అవునో ఆ ఆ విధంబుల రాక్షస ప్రయత్నాలు చేసే వాళ్ళు పాపం.

అలా 'ఖాళీగా లేము' అనిపించుకోడానికి ఎన్నో ప్రయత్నాలు చేసారు. మళ్ళీ చదువులు మొదలుపెట్టినవారు కొందరు. ఒక్క ఎంబీఏ క్లాస్ లోనే బీటెక్ నుండి ఎంబీబీస్ వరకు అన్ని డిగ్రీలు చేసిన వాళ్ళు కనపడతారంటే నమ్ముతారా? ఇంతటి రిస్కు తీసుకోలేని వారు, పిల్లల్ని కన్నారు ఎంచక్కా. పెద్దలు దగ్గర లేని పిల్లల పెంపకం అదొక పెద్ద మాయా వలయం. అర్ధ రాత్రి చంటి పిల్లకి ఎక్కిళ్ళు వస్తే ఏం చెయ్యాలో కూడా గూగుల్ ని అడగాల్సిందే. నెలల కూన ఆద మరచి కదలక మెదలక నిద్రపోతోంటే (అమంగళం ప్రతిహతమవు గాక ) అనుమానంతో ఊపిరి పిలుస్తోందో లేదో అని చెక్ చేసే ఈతరం వెర్రి తల్లులు ఎంతమందో. డిప్ప మీద ఒక్కటిచ్చి "నిద్రపోతున్న పసివాళ్ళని అలా చూడకూడదు" అని చెప్పే పెద్దాళ్ళు లేరుగా.

ఈ గ్రహణం వీడి వర్క్ పెర్మిట్లు వచ్చేదాకా పడని పాట్లు లేవంటే నమ్మండి. చంద్రుడికి ఎన్ని కళలు ఉంటాయో అన్ని మూడ్ స్వింగ్స్ ఒకే రోజులో చూపిస్తూ ఉంటారు. నిన్నటి వేళ చక్కగా వండి వడ్డించిన పిల్ల, ఈరోజు "నేనేమన్నా నీ సేవకి పుట్టానా? నీకు కావలసింది నువ్వు వండుకో," అని ఎందుకు విసుక్కుంటుందో అర్థం కాదు సదరు భాగస్వామికి . ఫేస్బుక్ లోనో వాట్సాప్ గ్రూప్ లోనో ఇన్నాళ్లు తనతో పాటు ఇంట్లో ఉన్న స్నేహితురాలు ఎవరో ఈ అరణ్య పర్వం వీడి ఉద్యోగ పర్వం మొదలు పెట్టి ఉంటుంది. 'అత్త తిట్టినందుకు కాదూ, తోడికోడలు నవ్వింద'న్న చందాన ఇంట్లో అంతా మూడు రోజులు యుద్ధ వాతావరణం రాజ్యం ఏలేస్తుంది. ఏ చిన్న పొరపాటు జరిగినా "తరతరాలుగా యుగయుగాలుగా తొక్కేస్తున్నారు, అణచివేస్తున్నారు " లాంటి భారీ లెక్చర్లు వినలేక అవతలి వారు బిక్కు బిక్కు మంటూ ఉండాల్సిందే ఇంట్లో. నన్నడిగితే ఇక్కడ ఉండేది రెండే రెండు గ్రూపులు... ఉద్యోగాలు చేసే

వాళ్ళు , చెయ్యని వాళ్ళు. ముందు ఈ వడపోత అయ్యిన తర్వాత గానీ మిగతా వడపోతలకు తావు లేవు. ఆ లెక్కలు  ఎవరెవరి విఘ్నుతని బట్టి ఉంటాయనుకోండి.

ప్రస్తుతం మనం మొదటి గ్రూప్ కి చెందుతాం అనమాట. అందుకేగా ఈ కథ చెప్పుకొచ్చింది. మా ఏరియాలో పైన చెప్పిన డిపెండెంట్ కష్టాలు పడే చిలకమ్మలంతా ఒక గ్రూపుగా చేరాము. మా కష్టాలు సుఖాలు కలబోసుకుని ఈ 'బలవంతపు ఏకాంతపు విశ్రాంతి' దశని తప్పించుకోడానికి ఎవరికి తోచిన సలహాలు వారు ఇస్తుంటారు . రేపు రాబోయే మహిళా దినోత్సవం నాడు మీటింగు ఏర్పాటు చేస్కున్నాము. భోజనాలు ఆర్డర్ ఇచ్చుకోవడం అనేది మళ్ళి డాలర్ స్వాతంత్రంతో కూడుకున్నది కాబట్టి మేమె పాట్ లాక్ పెట్టుకుని , సమావేశమై సదరు భోజన తాంబూలాలు స్వీకరించి ఎవరికి వారే ఆనందించవలెనన్నమాట .

అసలైతే మీటింగులో మా డిపెండెంట్ కష్టాల గురించి, చుట్టాల ఒత్తిళ్ల గురించి, ఉద్యోగ ప్రయత్నాల  వల్ల వస్తున్న స్ట్రెస్ గురించి ఏకి పడేద్దామనుకున్నాను. కానీ ఒక చిన్న సంఘటన నా ఆలోచనా విధానాన్నే మార్చేసింది. ఆ రోజు ఈ మధ్యనే ప్లే స్కూల్ లో వేసిన నా బుడ్డదాన్ని తీస్కుని వద్దామని రోజూలాగానే వెళ్ళాను స్కూల్ కి. పార్కింగ్ లాట్ లో నా పిల్లదాని స్నేహితుడి అమ్మ కనిపించింది. ఎప్పుడో కానీ రాదు కాండేటు, వర్కింగ్ మామ్ కదూ. పైగా కనిపించినా కూడా చూపులు కలపదు, అరక్షణం నవ్వుకి వేస్ట్ అయిపోతుందేమో అన్న హడావిడిలో ఉంటుంది. రేప్పొద్దున్న నేను కూడా ఉద్యోగం వస్తే ఇలానే బిజీ బిజీ గా పరిగెట్టాలేమో అని నా 'ఉద్యోగం వస్తే ' లిస్ట్ లో చేర్చుకోబోయాను. ఛి మరి ఇంతలా డెస్పెరేట్ గా తయారయ్యానేంటి అని ఆ ఆలోచన విదిలించేశా. ఇంతకీ చెప్పొచ్చేదేంటంటే సదరు వర్కింగ్ మామ్ నన్ను చూసి నవ్వింది. నాకెందుకో నమ్మ బుద్ధి గాక చుట్టూ పక్కల, ముందూ వెనకా చూసాను. ఎవ్వరూ , లేరు ..నన్నే. నేను కూడా నవ్వాను. మనసులో మాత్రం కచ్చితంగా 'చపాతీ / కర్రీ సర్వీసులూ', 'ఆఫ్టర్ స్కూల్ కేర్ ' లాంటి సమాచారం ఏదైనా కావాలేమో అనుకున్నాను. మాతో అలాంటివే మాట్లాడతారు కదా మరి.

"హెల్లో !"

"హాయ్ ... ఏంటి ఇవాళ ముందే వచ్చారు?"

"నీల్ కి ఒంట్లో బాగోలేదంట అండి, టీచర్ ఫోన్ చేసింది. అందుకే ముందే వచ్చి తీసుకెళ్తున్నాను. సీసనల్ ఫీవర్ అనుకుంటా . "

"ఓ ..అయ్యో అలాగా?"

"బాస్ దగ్గర పర్మిషన్ తీస్కుని వచ్చాను. నసిగి నసిగి వదిలాడు. ఈ జ్వరం ఎన్ని రోజులు ఉంటుందో అండీ . వర్క్ ఫ్రొం హోమ్ కి కూడా ఒక రోజుకంటే ఎక్కువైతే ఏడ్చి చస్తాడు. ఇలా ఆలోచిస్తునందుకు నామీద నాకే జాలి వేస్తోంది. ఉద్యోగం వచ్చే దాకా ఎప్పుడెప్పుడు వస్తుందా అని చూస్తాము, వచ్చాక ఏదో సుఖపడిపోయినట్టు. ఇది ఇంకో రంగుల రాట్నం అంతే.మిమ్మల్ని చూస్తుంటే నా పాత రోజులు గుర్తొస్తున్నాయి. ఇంత తీరిక మళ్ళీ జీవితంలో చూడరు, ఒకవేళ తీరిక వచ్చే వయసుకి ఇప్పటి ఓపిక ఉండకపోవచ్చు. నేను ఎప్పుడెప్పుడు ఉద్యోగం వస్తుందా అని ఉన్న సమయాన్ని ఎంజాయ్ చెయ్యలేదు. మీకోసం , మీ వాళ్ళకోసం కేటాయించడానికి ఇంత సమయం మళ్ళీ దొరకకపోవచ్చు. ఈ రోజుల్లో ఉద్యోగాలు తప్పవు, అవి మన ఉనికిగా మారాయి. కానీ అవి వచ్చే వరకు ఉండే ఈ సమయాన్ని వృధా పోనివ్వకండి. ప్రతి క్షణం ఆస్వాదించండి. ఎందుకో చెప్పాలనిపించింది. ఉంటాను బాయ్ అండి ." అంటూ సుడిగాలిలా పిల్లాడ్ని తీస్కుని వెళ్ళిపోయింది.

పాపని తీస్కుని వస్తుంటే మళ్ళీ వర్షం,,, జల్లులు జల్లులుగా. వచ్చిన నాలుగేళ్లలో ఎన్నడూ చూడలేదు ఇలాంటి వర్షాలు. ఇన్నాళ్ళకి గొడుగు వాడే అవకాశం వచ్చినందుకు బుడ్డదాని ఆనందానికి అంతే లేదు. ఇంటికి వస్తుంటే ఒకటే ఆలోచనలు. ఆవిడ అన్న మాటల్లో నిజం లేకపోలేదు. ఇద్దరూ ఉద్యోగం చేస్తే గానీ చన్నీళ్లకి వేన్నీళ్ల తోడు ఉండదనేది అమ్మా వాళ్ళ తరంలోనే చూసేసాం. చెయ్యాల్సిందే ..కానీ పరిస్థితులు మనకి అనుకూలంగా లేనప్పుడు , అన్ని ప్రయత్నాలు చేసినా కలిసిరానప్పుడు , బాధ పడుతూ చుట్టూ వాళ్ళని బాధపెడుతూ చేతిలో ఉన్న ఈ సమయాన్ని వ్యర్థం చేస్తున్నామా? ఇంటిని, పిల్లల్ని చూసుకోవడం అనే పనిని తేలిగ్గా తీస్కుంటున్నామా? 'సెల్ఫ్ సెంటర్డ్  విమెన్'  'ఇండిపెండెంట్ విమెన్' గా తీర్చిదిద్దారు మా తరాన్ని. విమెన్ 'సెల్ఫ్ సెంటెర్డ్ ' గా ఉంటే మంచిదే, ఉండాలి కూడా. కానీ రేపటి తరానికి కాబోయే అమ్మలు 'సెల్ఫ్ సెంటెర్డ్ ' అయితే , ఆ తరం భవిష్యత్తు, వ్యక్తిత్వం ఏమవుతుంది? వారికీ మనకీ ఉండాల్సిన పాశాలు ?

ఏదో అనుకున్నాను గానీ జీవితంలో నాకు తెలీని అధ్యాయాలు ఇంకా చాలా ఉన్నాయి. ఇప్పుడు ఇంకొక తరం బాధ్యత కూడా చేరింది. " చిన్ని నా బొజ్జకు శ్రీరామ రక్ష " అనుకుంటే ఎలా. ఉద్యోగం వచ్చేలోపు నేను చాలా మారాలి .

- రాబోయే జీవితం పై ఆశలు పెంచుకోవాలి, దానికోసం తగు కృషి చెయ్యాలి.
- కానీ ఉన్న జీవితాన్ని ఆనందించాలి, ఆస్వాదించాలి.
- ఉద్యోగం వచ్చాక ఇంకెటువంటి 'రిగ్రెట్స్' ఉండకూడదు.
- చుట్టాలు పోరినట్టు 'జీవితంలో వెనకేసుకోవడం' ముఖ్యమే. కానీ వెనకేసుకున్నాక, తీరిగ్గా కూర్చుని ఆలోచించడానికి జీవితంలో కొన్ని మధుర క్షణాలు అంటూ ఉండాలి కదా! కాబట్టి జీవితంలో 'బ్యాలెన్సింగ్' నేర్చుకోవాలి.

ముందైతే అర్జంటుగా ఈ జ్ఞానాన్ని మా గ్రూపులో ఉమెన్స్ డే నాడు పంచుకోవాలి. తీరుతుందో లేదో తెలీని కాలిఫోర్నియా కరువే తీరబోతోంది, మేము సెటిల్ అవలేముటండీ . 'అప్నా టైం ఆయేగా ' అన్న ఆశావహ దృక్పథంతో నా తోటి చిలకమ్మలంతా ముందుకి సాగాలి అనీ, అంతవరకూ ఎటువంటి నిరాశా నిస్పృహలకీ లోనుకావొద్దని కోరుకుంటూ .. మహిళామణులందరికీ "మహిళా దినోత్సవ శుభాకాంక్షలు !"

*(వచ్చేనెలలో అమెరికా అమ్మాయి ఏం చెబుతుందో.. ఎదురుచూద్దాం..!!)*

Post your comments